క్లుప్తంగా

జల్‌జీవన్ పనులపై ఆరా



ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ మంచి నీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లుతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల్లో జల్ జీవన్ మిషన్ పనులు ఎంత వరకు వచ్చాయి, ఎక్కడెక్కడ జరుగుతున్నాయి, నిధుల మంజూరై టెండర్లు పిలిచి పనులు ప్రారంభం కానివి ఏమైనా ఉన్నాయా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు కొనసాగించాలని, నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. డీఈ సుదర్శనరావు, ఏఈ ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సారవకోట:భూ సార పరీక్షలను రైతులు చేయించుకోవాలని వ్యవసాయాధికారి వెంకటరావు సూచించారు. మండలంలోని కేశవలన పంచాయతీ పద్మాపురంలో భూసార పరీక్షలకు శనివారం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతీ సచివాలయ పరిధి నుంచి 30 మట్టి నామూనాలు సేకరించడం జరుగుతుందన్నారు. వీటిని ఆమదాలవలసలో ఉన్న ల్యాబ్‌కు పంపించి ఫలితాలు అందజేయస్తామన్నారు. ఆ ఫలితాల ద్వారా పొలానికి కావల్సిన పోషకాలు, ఎరువులు ఏ మోతాదులో అందించాలో తెలుస్తుందన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు

కొత్తూరు: కొత్తూరులోని హరిదాసు కొనేరు గట్టుపై ఉన్న పిచ్చిమొక్కలను శనివారం తొలగించారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్షణరావు పర్యవేక్షించారు. ఈ నెల 23 తేదీన కొత్తూరులో సీతారామ మందిరం వార్షికోత్సవం సందర్భంగా తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నారు. ప్రజల అవసరాలకు ఇబ్బంది లేకుండా చెరువు చుట్టూ శుభ్రం చేయించారు.

సమయపాలన తప్పనిసరి



రికార్డులను పరిశీలిస్తున్న ఏఎంఓ లక్ష్మీనారాయణ

జలుమూరు: ఉపాధ్యాయులకు సమయపాలన తప్పనిసరి అని సర్వశిక్ష ఏఎంఓ గుంట లక్ష్మీనారాయణ అన్నారు. పర్లాం ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులందరికీ కిట్‌లు అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యమైనది పెట్టాలన్నారు. రికార్డుల నిర్వహణ తప్పని సరిగా ఉండాలన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్యను బోధించాలన్నారు. ఉపాధ్యాయుడు ఎం.రమణ, సిబ్బంది ఉన్నారు.

బాలలను పనిలో పెడితే కఠిన చర్యలు



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

హిరమండలం: బడి ఈడు కలిగిన చిన్నారులంతా పాఠశాలల్లో ఉండాలని అధికారులు సూచించారు. మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో శనివారం తనిఖీలు చేపట్టాలరు. బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని యజమానులకు హెచ్చరించారు. బాలకార్మిక వ్యవస్థ నియంత్రణ అందరి బాధ్యత అని అన్నారు. ఈ తనిఖీల్లో కార్మిక శాఖ, బాలల సంరక్షణ అధికారి, విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

18న మండల సమావేశం

బూర్జ: ఈ నెల 18వ తేదీన మండల పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

● అవగాహన



సారవకోట మండలంలోని తొగిరి గ్రామంలో రైతులకు నవ ధాన్యాల సాగుపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. పలువురు రైతులకు రూ.800 విలువ చేసే నవ ధాన్యాల సాగు ప్యాకెట్లు అందించారు. అనంతరం పొలాల్లో వీటిని ఎలా జల్లుకోవాలో వివరించారు. నవ ధాన్యాల సాగు వల్ల భూమికి కలిగే లాభాలు, వరి పంటకు ఎటువంటి ప్రయోజనాలు కలుగుతాయో తెలియజేశారు. - సారవకోట

● పరిశీలన



కొత్తూరు మండలంలోని మెట్టూరు పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ త్రివిక్రమరావు శనివారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని ఉపాధి సిబ్బందికి హెచ్చరించారు. రోజుకు రూ.300 వేతనం వచ్చేలా పనులు చేయాలన్నారు. ఉపాధి నిధులతో 90 రోజులు చేపట్టిన గృహ నిర్మాణాలను పరిశీలించారు. - కొత్తూరు

● అప్రమత్తం



వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈదురుగాలులు, వర్షాల పట్ల విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.భయ్యన్నాయుడు పేర్కొన్నారు. పొందూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం వీచిన గాలులకు జిల్లాలో సుమారు 50 విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు గుర్తించామన్నారు. సబ్‌స్టేషన్ పరిసరాల్లో గల విద్యుత్ పరికరాలను పరిశీలించారు. ఉపకేంద్రం చుట్టూ పెరిగిపోయిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ఏఈఈ యు.వి.రమణమూర్తి, ఏఈ పైడి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. - పొందూరు

పలుచోట్ల భారీ వర్షం



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు

- ఈదురుగాలుల బీభత్సం
- రహదారులపై చేరిన వర్షంనీరు

సరుబుజ్జిలి: మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు మెరుపులతో శనివారం వర్షం దంచికొట్టింది. గత కొద్ది రోజులుగా తీవ్ర ఉక్కపోతతో అవస్థలు పడుతున్న ప్రజలకు వర్షం కొంతమేర ఉపశమనం కలిగించింది. వరి విత్తనాలు వేసేందుకు ఈ వర్షం ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు తెలిపారు. భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, గాలులు వీయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. రహదారులపై వర్షం నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పది రోజులు గడిచిపోయాయి. రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. శనివారం ఉదయం నుంచి ఎండ తీవ్రతతోపాటు వేడి గాలులు వీచాయి. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాతపట్నం: మండలం వ్యాప్తంగా శనివారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వర్షం కురవడంతో ప్రజలకు కొంత ఉపశమనం కలింది. మూడు నెలలుగా మహేంద్ర తనయ నది, చేరువుల్లో నీరులేకపోవడంతో పశువులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. పాతపట్నంలో కుండపోత వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గంట సమయం భారీ వర్షం కురవడంతో రాకపోకలకు స్తంభించాయి. కొరసవాడ, కాగువాడ, బురాగాం తదితర గ్రామాల్లో పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్.ఎన్.పేట: తురకపేట ప్రాంతంలో కురుస్తున్న వర్షం



పాతపట్నం: పాతపట్నంలో కురుస్తున్న వర్షం

వరి విత్తనాల పంపిణీ



పాతపట్నం: వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: నియోజకవర్గంలోని రైతులకు ఖరీఫ్‌కు ప్రభుత్వం రాయితీపై వరి విత్తనాలను అందజేస్తుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక కోర్టు కూడలి వద్ద ఉన్న వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులకు వరి విత్తనాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జేడీ కె.శ్రీధర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 59,050 ఎకరాల్లో వరి సాగుకు సంబంధించి 3,978 క్వింటాళ్ల విత్తనాలు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హిరమండలం జెడ్పీటీసీ బుచ్చిబాబు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, తూలుగు తిరుపతిరావు, ఎస్.మోహన్‌రావు, పైల బాబ్జి, శివ్వాల తేజేశ్వరరావు, పలాస ఏడీ ఎల్.వి.మధు, డీపీఎం రేవతి, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల ఏఓలు, ఏఈఓలు, వీఏఏలు, నాయకులు పాల్గొన్నారు.



కొత్తూరు: విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పడాల కృష్ణవేణి



మెళియాపుట్టి: విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

కొత్తూరు: రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వరి విత్తనాలను వినియోగించుకోవాలని కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి అన్నారు. కొత్తూరు పంచాయతీలోని రైతు భరోసా-1, 2 కేంద్రాల్లో సర్పంచ్ కృష్ణవేణి వరి విత్తనాల పంపిణీని శనివారం ప్రారంభించారు. రైతులకు ప్రతి ఎకరాకు 30 కిలోల బస్తా అందివ్వడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

హిరమండలం: కల్లట రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు, మండల ప్రత్యేకాహ్వానితుడు తూలుగు తిరుపతిరావు వరి విత్తనాలు అందించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సంధ్య, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం, మర్రిపా-సి రైతు భరోసా కేంద్రంలో అధికారులు, నాయకులు కలిసి శనివారం విత్తనాలు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ భానోజీ రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం సకాలంలో విత్తనాలు అందిస్తుందన్నారు. వీఏఏ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం: రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

అంగన్‌వాడీల్లో చిన్నారులను చేర్చండి

ఆమదాలవలస: మండలంలోని దూసి, తొగరాం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రం పిలుస్తోంది రా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దూసి పాఠశాల హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్త పంచాది లతాదేవి, సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మూడేళ్లు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి రాష్ట్ర ప్రభుత్వం అందించే విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు.



దూసిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఈ కార్యక్రమంలో దూసి, తొగరం సెక్టార్ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ

మెళియాపుట్టి: అత్యవసర సమయాలలో ప్రాణాలు కాపాడటానికి 108 వాహనాలు సంజీవనిలా ఉపయోగపడాలని డివిజనల్ పర్యవేక్షణ అధికారి జగన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న 108 వాహనాన్ని శనివారం తనిఖీ చేశారు. ఆక్సిజన్, అత్యవసర సమయాల్లో అందించాల్సిన మందులు, ఇతర పరికరాలను పరిశీలించారు. వాహనం కండిషన్ ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. పైలట్ చంద్రశేఖర్, ఈఎంటీ సరోజిని, సిబ్బంది ఉన్నారు.



108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న డివిజనల్ పర్యవేక్షణ అధికారి జగన్

సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు



నిర్వహణ పనులు చేస్తున్న సిబ్బంది

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచంద్రి వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం నిర్వహణ పనులను చేపట్టారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో విద్యుత్ సరఫరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా నిర్వహణ పనులు చేపట్టామని విద్యుత్ శాఖ ఏఈ వెంకటేష్ తెలిపారు. సబ్ స్టేషన్ వద్ద వైర్లు సరిచేయటం, నట్లు బిగించటం, ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ నిల్వలు, గ్రీజ్ వంటి పనులు పూర్తి చేశామన్నారు. లైన్‌మన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు బడికి.. పెద్దలు పనికి..

శ్రీకాకుళం న్యూకాలనీ: బడిఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని జిల్లా విద్యాశాఖాకారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో డీఈవో, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, శ్రీకాకుళం మండల విద్యాశాఖ అధికారి ఎస్.కృష్ణ తదితరులు విద్యార్థులతో కలిసి శనివారం చాపలవీధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ల వయసుగల బాలలంతా నిర్బంధ ఉచిత పాఠశాల విద్య అభ్యసించాలన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్యాన్ని హరించే హక్కు తల్లిదండ్రులకు లేదన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఉందన్నారు. బడిలో చేర్పించడం కోసం లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పోటీప్రపంచానికి అనుగుణంగా డిజిటల్ విద్యను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో చిన్నారులంతా చక్కగా చదువుకోవాలని జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాల కోఆర్డినేటర్ పూడి జనార్దనరావు తెలిపారు. సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు, సింహాద్రి నీరజ, నలినీకాంత్, వెలమల ఉమా, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణం

ఆమదాలవలస: ఈ నెల 17 నుంచి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో 94వ వార్షిక కల్యాణోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ ఈఓ టి.రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఐదు రోజులపాటు నిర్వహించనున్న కల్యాణ ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు సహాయ, సహకారాలు అందిస్తున్నారన్నారు. సున్నం వేసేందుకు రైల్వే కాంట్రాక్టర్ అన్నెపు సూర్యనారాయణ తనవంతు సహకారాన్ని అందిస్తున్నారని తెలిపారు. బొడ్డేపల్లి ప్రకాష్ రెండు బీరువాలు, జనార్దన్ కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారన్నారు. దుంపల అనిల్ కుమార్ ఒక సీలింగ్, ఒక పెడస్టల్ ఫ్యాన్, ఎల్ఐసీ ఏజెంట్ ధర్మారావు వాటర్ డిస్పెన్సర్, అడ్వకేట్ పేడాడ మోహనరావు మూడు సీలింగ్ ఫ్యాన్లు, కూన ధర్మారావు సీలింగ్ ఒక ఫ్యాన్ తదితర వస్తువులను దేవాలయానికి అందించారన్నారు. దేవస్థానం అభివృద్ధికి నిధులు, వస్తువులు అందించేందుకు కార్యనిర్వాహణధికారి టి.రవి సెల్ నెంబర్ 9441073977ను దాతలు సంప్రదించాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

సారవకోట: మండలంలోని అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం విజయాంభికా యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు చల్లా ఆనందరావు శనివారం ఒక ప్రనటలో పేర్కొన్నారు. శంకర్ ఫౌండేషన్ నుంచి వైద్యులు వచ్చి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు తరలిస్తామన్నారు.

17న బక్రీద్ ప్రార్థనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జి.టి.రోడ్డులో ఉన్న జామియా మసీదులో ఈ నెల 17న ఉదయం 9 గంటలకు బక్రీద్ ప్రార్థనలు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు ఖాన్, బాషా ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు జామియా మసీదు వద్దకు అందరూ చేరుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



కొత్తూరు: కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రంజిత్

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిట్లు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీధర్, తిరుమలరావు, హెచ్‌ఎంలు రామమూర్తి, నల్ల కుమారస్వామి, నాయకులు సలాన మోహన్‌రావు, సలాన శరత్, పైల బాబ్జి, ఎస్.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్లును వైఎస్సార్‌సీపీ నాయకుడు అగతమూడి రంజిత్ శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ కిట్లును సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం ఎల్.సింహాద్రినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రథమ చికిత్స శిక్షణ



సర్టిఫికెట్లతో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రొఫెషనల్ ప్రథమ చికిత్స శిక్షణ శనివారంతో ముగింది. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ఏఓ నర్సింగరావు, మేనేజర్ గుణాకరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు చిన్నయరావు తదితరులు పాల్గొన్నారు.